సాక్షి వనపర్తి

శనివారం । 4 । మే । 2024



ఆ పార్టీలను ఓడించాలి
బీజేపీ అనుకూల పార్టీలను ఓడించాలని సీపీఐ జాతీయ నేత నారాయణ పిలుపునిచ్చారు.
వివరాలు IIలో ▸



భారీగా నగదు పట్టివేత
ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న వాహన తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడుతోంది.
వివరాలు IIలో ▸

గరిష్టం/కనిష్టం
46.1 /24.5

వాతావరణం
రోజంతా ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం వేళలో ఉక్కపోత పెరుగుతుంది. అప్పుడప్పుడు వడగాల్పులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు : డీఈఓ

వనపర్తి టౌన్: 10వ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 16వ తేదీ వరకు కొనసాగుతాయని డీఈఓ గోవిందరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 16 వరకు ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. 3 సబ్జెక్టులోపు ఉంటే రూ.110, అంతకన్నా ఎక్కువ ఉంటే రూ.125 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



పెబ్బేరు రూరల్: కాంగ్రెస్‌పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా శుక్రవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పెబ్బేరులో మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో తిరిగి పట్టణ ప్రజలు, పండ్లు, కూరగాయలు, టీకొట్టు, వ్యాపారులను కలిసి హస్తం గుర్తుకు ఓటువేసి మల్లు రవిని గెలిపించాలని కోరారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మొద్దని.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల కోడ్‌తో రుణమాఫీ, మహిళలకు పింఛన్‌లో జాప్యం జరిగిందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి దేశం కోసం.. ధర్మం కోసమంటూ మతరాజకీయాలు చేస్తూ విధ్వంసాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సురేందర్‌గౌడ్, వెంకటేష్‌సాగర్, భానుప్రకాష్‌రెడ్డి, రంజిత్, రవీందర్‌నాయుడు, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ బీజేపీని ఓడిద్దాం : సీపీఎం



వీపనగండ్ల: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడిస్తేనే పేదలకు మేలు జరుగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ నియంతృత్వ పోకడలతో రాజ్యాంగం మౌలిక సూత్రాలకు ప్రమాదం వాటిల్లే పరిస్థితులు ఉన్నాయని.. గద్దె దింపి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మల్లు రవి గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పార్టీ మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, నాయకులు మహబూబ్ పాషా, శాంతమ్మ, మురళి, కృష్ణయ్య, ఆశన్న, నాగరాజు, బాలగౌడ్, వెంకటయ్య పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,012 అడుగులు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం 1,012 అడుగుల నీటిమట్టం ఉంది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా నీటి సరఫరా లేదని, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

‘ప్రస్తుత రాజకీయాలు మలినం’

వనపర్తిటౌన్: ప్రస్తుత రాజకీయాలు మలినమయ్యాయని.. అవినీతి పెరగడంతో ప్రజా సమస్యలు మరిచి దోపిడీకి పాల్పడుతున్నారని ఎస్ఎఫ్ఐ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు బి.శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలని, అప్పుడే 100 శాతం దేశాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టి ఎలాంటి అవినీతికి పాల్పడకుండా తోటి నాయకులు, ప్రజలకు ఆదర్శంగా నిలిచేందుకు ప్రయత్నించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది, ఉపాధ్యక్షుడు మల్లేష్, కమిటీ సభ్యులు వీరన్న నాయక్, సాయి, భరత్, శివ తదితరులు పాల్గొన్నారు.



● అగ్ర నేతల క్యూ..

సై.. అంటే సై !

కీలక దశకు లోక్‌సభ ఎన్నికల పోరు

- ప్రచారానికి మిగిలింది ఇంకా వారం రోజులే..
- 2 స్థానాల్లోనూ గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీల వ్యూహాలు
- నేడు కొత్తకోటలో కాంగ్రెస్ కార్నర్ మీటింగ్.. సీఎం రేవంత్ రాక
- రేపు ఎర్రవల్లి చౌరస్తాలో సభ.. హాజరుకానున్న రాహుల్ గాంధీ
- 10న నారాయణపేటకు ప్రధాని మోదీ.. త్వరలో అమిత్‌షా..



సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: లోక్‌సభ ఎన్నికల పోరు కీలక దశకు చేరింది. ఇంకా వారం రోజుల్లో ప్రచార పర్వం ముగియనుంది. ఈ మేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో విజయమే లక్ష్యంగా ప్రధాన పార్టీలు ప్రత్యేక వ్యూహాలతో ముందుకు సాగుతున్నాయి. రాష్ట్రంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సీఎం రేవంత్ సొంత ఇలాకా కావడంతో పార్టీ అధిష్టానం పాలమూరుపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టింది. రెండింటిలోనూ విజయ కేతనం ఎగురవేసి సత్తా చాటాలని బీజేపీ.. సిట్టింగ్ స్థానాలను తిరిగి దక్కించుకుని, పట్టు నిలుపుకోవాలని బీఆర్‌ఎస్ కదనరంగంలో దూకుడు ప్రదర్శిస్తున్నాయి. ప్రచార గడువు దగ్గరపడుతుండడంతో ఆయా పార్టీల అభ్యర్థులకు మద్దతుగా అగ్రనేతలు రంగంలోకి దింపుతున్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ల పరిధిలో జాతీయ, రాష్ట్రస్థాయి నేతలు రోడ్‌షోలు, బహిరంగ సభలు, కార్నర్ మీటింగ్‌లకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ప్రచారం మరింత హోరెత్తనుంది.

ఆదివారం రాహుల్ గాంధీ..

నాగర్‌కర్నూల్ నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న మల్లురవి గెలుపును కాంక్షిస్తూ ఆ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆదివారం పర్యటించనున్నారు. ఎర్రవల్లి చౌరస్తాలో సాయంత్రం జరిగే బహిరంగ సభలో పార్టీ శ్రేణులు, ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నారు. రాహుల్ గాంధీ ఆరు నెలల్లో ఉమ్మడి జిల్లాకు రావడం ఇది ఐదోసారి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయన కోస్గిలో రేవంత్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన బహిరంగ సభతో పాటు మహబూబ్‌నగర్, గద్వాల, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో జరిగిన ప్రచార సభల్లో పాల్గొన్నారు.

నేడు కొత్తకోటకు సీఎం రేవంత్ రాక..

కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. రేవంత్ సొంత జిల్లా కావడంతో వీరి గెలుపు బాధ్యతలను ఆయన తన భుజాలపై వేసుకున్నారు. ఈ మేరకు కొడంగల్, కోస్గి, మద్దూరు, మహబూబ్‌నగర్, నారాయణపేట, బిజినేపల్లిలో రోడ్ షోలు, కార్నర్ మీటింగులు, బహిరంగసభల్లో పాల్గొన్నారు. తాజాగా శనివారం ఆయన మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధి దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కొత్తకోటకు రానున్నారు. రోడ్ షోతో పాటు కార్నర్ మీటింగ్‌లో మాట్లాడనున్నారు. వచ్చే వారం మక్తల్ ఎన్నికల ప్రచార సభలో ముఖ్యమంత్రి పాల్గొనే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

కేటీఆర్.., హరీశ్‌రావు..

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులు మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు మద్దతుగా బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ఆయా పార్లమెంట్ స్థానాల్లో నిర్వహించిన రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లకు హాజరై పార్టీ శ్రేణులు, ప్రజలనుద్దేశించి మాట్లాడిన విషయం తెలిసిందే. ఈ వారంలో ప్రచార గడువు ముగిసేలోపు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్), మరో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వివిధ ప్రాంతాల్లో పర్యటించనున్నారు. కొత్తకోట, దేవరకద్ర, మక్తల్, భూత్పూర్, నాగర్‌కర్నూల్‌లో నిర్వహించనున్న రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌కు హాజరుకానున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

నరేంద్ర మోదీ.. అమిత్ షా..

నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా మార్చి 16న ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారసభకు పార్టీ అగ్రనేత, ప్రధాని మోదీ హాజరైన విషయం తెలిసిందే. తాజాగా ఈ నెల పదో తేదీన బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు మద్దతుగా ఆయన మరోసారి పాలమూరుకు రానున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని నారాయణపేట అసెంబ్లీ నియోజకవర్గంలో నిర్వహించనున్న ఎన్నికల ప్రచార సభలో ప్రధాని పార్టీ శ్రేణులు, ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అదేవిధంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సైతం మహబూబ్‌నగర్‌కు రానున్నారు. పట్టణంలో నిర్వహించే రోడ్‌షోతో పాటు కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొననున్నట్లు తెలిసింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా త్వరలో నాగర్‌కర్నూల్‌లో పర్యటించనున్నట్లు సమాచారం.

హోం ఓటింగ్ ప్రారంభం

వనపర్తి: పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన వృద్ధులు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిన విషయం తెలిసిందే. జిల్లాలో శుక్రవారం హోం ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా 8వ తేదీ వరకు కొనసాగనుంది. జిల్లావ్యాప్తంగా 269 మంది ఓటర్లు హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా.. వారందరూ స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేందుకు జిల్లా ఎన్నికల అధికారి ఎనిమిది పోలింగ్ బృందాలను ఏర్పాటు చేశారు. దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తారు. మొదటిరోజు జిల్లావ్యాప్తంగా 40 మంది దివ్యాంగులు, 75 మంది వృద్ధులు మొత్తం 115 మంది హోమ్ ఓటింగ్ వినియోగించుకున్నారు. అలాగే 240 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం 8 కౌంటర్లు ఏర్పాటు చేశారు.



ఓటుహక్కు వినియోగించుకున్న దివ్యాంగురాలి వేలిపై సిరామార్క్ వేస్తున్న ఎన్నికల సిబ్బంది

సంతోషంగా ఉంది..

నా ఓటుహక్కును స్వేచ్ఛగా ఇంటివద్దనే వినియోగించుకున్నా. గతంలో పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసేందుకు ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం అమలు చేస్తున్న ఈ విధానం చాలా బాగుంది.
– మాధవి, దివ్యాంగురాలు, వనపర్తి

అదనపు బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తి

● జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్

వనపర్తి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు నిలిచినందున ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకోసం మరో 380 బ్యాలెట్ యూనిట్లు వినియోగించేందుకు శుక్రవారం ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్ తెలిపారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోదాం నుంచి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అదనపు బ్యాలెట్ యూనిట్లను పోలీసు భద్రత నడుమ చిట్యాల వ్యవసాయ మార్కెట్‌యార్డులోని ఈవీఎం రిసెప్షన్ కేంద్రానికి తీసుకొచ్చారు. అనంతరం వారి సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.నగేష్, సి–సెక్షన్ సూపరింటెండెంట్ రమేష్‌రెడ్డి, బీజేపీ నాయకుడు ప్రవీణ్, సీపీఎం నాయకుడు పరమేశ్వరాచారి, టీడీపీ నాయకుడు శంకర్, బీఆర్‌ఎస్ నాయకుడు జమీల్ తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎం గోదాం వద్ద వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

కొత్తకోట రూరల్: రోజురోజుకు ఎండ తీవ్రత అధికమవుతుందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్యాధికారి డా. జయచంద్రమోహన్ సూచించారు. శుక్రవారం మండలంలోని అమడబాకుల ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ఓఆర్‌ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలని, ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూడాలని కోరారు. ఉపకేంద్రంలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై గ్రామస్తులతో ఆరా తీశారు. ప్రజలు అవసరమైతే తప్పా బయటకు రావద్దని.. బయటకు వెళ్తే వాటర్ బాటిల్, ఓఆర్‌ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం కొత్తకోటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు.



కొత్తకోట పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డా. జయచంద్రమోహన్

హెలీప్యాడ్ ఏర్పాటును పరిశీలించిన ఎమ్మెల్యే

కొత్తకోట: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి కొత్తకోటకు వస్తున్న నేపథ్యంలో పట్టణ శివారులోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ పనులను దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అసెంబ్లీ ఎన్నికల్లో ఎలా కష్టపడి పనిచేశారో పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపునకు ప్రతి కార్యకర్త, నాయకుడు పని చేస్తున్నారన్నారు. పదేళ్లు పాలించిన బీజేపీ నాయకులు ప్రజల సంక్షేమం పట్టించుకోకుండా రాముడి పేరు చెప్పుకొంటూ రాజకీయాలు చేశారని.. ఈ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే వెంట కరుణాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ధన్వాడ బాలస్వామి, యాదయ్యసాగర్, సంద వెంకటేష్, గోకరయ్య తదితరులు ఉన్నారు.



హెలీప్యాడ్ పనులను పరిశీలిస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

జిల్లాల రద్దు లీకులపై సీఎం స్పందించాలి

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: జిల్లాల రద్దు విషయమై కాంగ్రెస్ ఇస్తున్న లీకులతో మీడియాలో రోజుకో వార్త కథనం వస్తోందని.. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయంపై జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. పరిపాలన సౌలభ్యం, ప్రాంతాల అభివృద్ధి కోసం కొత్త జిల్లాలు ఏర్పాటు చేశామని, ఆ తర్వాత ప్రజల జీవన విధానం మెరుగుపడిందని గుర్తించాలన్నారు. జిల్లాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తే మరో ఉద్యమం తెలంగాణలో మొదలవుతుందన్నారు. ఆచరణ సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చిత్తశుద్ధి ఉంటే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పోడు రైతులకు రైతుబంధు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, నాయకులు లక్ష్మారెడ్డి, రఘుపతిరెడ్డి, మన్నెపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ప్రమోషన్లు, బదిలీలు తక్షణమే చేపట్టాలి

● తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు

కొత్తకోట రూరల్: రాష్ట్రంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించి ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు తక్షణమే చేపట్టాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తకోటలో నిర్వహించిన సంఘం కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ఎస్‌సీటీఈ అనుమతితో ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఈసీ అనుమతితో పదోన్నతులు, బదిలీలు చేట్టాలన్నారు. అంతేగాకుండా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, జీపీఎఫ్, మెడికల్ బిల్స్, జీఎల్ఐ మెచ్యూరిటీ అయిన బండ్ల నగదును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి విష్ణువర్ధన్, గద్వాల జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు హరికృష్ణ, రాఘవేంద్రాచారి, అరవింద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దేవన్న, కృష్ణ, శివనారాయణ, రాములు, లక్ష్మయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు

మహిళలే నిర్ణేతలు

రెండు లోక్‌సభ స్థానాల్లో మగువల ఓట్లే అధికం



- మహబూబ్‌నగర్‌లో 50.53, నాగర్‌కర్నూల్‌లో 50.24శాతం మహిళా ఓటర్లు
- అభ్యర్థుల జాతకాలు తేల్చేది వీరే..
- వారిని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న నేతలు

మహబూబ్‌నగర్ డెస్క్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపోటములకు మహిళా ఓట్లే కీలకంగా మారాయి. ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉన్న నేపథ్యంలో ఎంపీ అభ్యర్థుల గెలుపును శాసించేది వీరే. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ పురుషుల కంటే మహిళలే అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన తాజా ఓటర్ల జాబితా ప్రకారం మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంలో 16,82,470 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో 50.53 శాతంతో 8,50,172 మంది మహిళా ఓటర్లే ఉన్నారు. ఇక్కడ పురుషుల కంటే 17,916 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానంలో 17,38,254 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో కూడా 50.24 శాతంతో 8,73,340 మంది మహిళలు ఉన్నారు. ఇక్కడ పురుషుల కంటే 8,465 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ పరిధిలోని కొల్లాపూర్, కల్వకుర్తి సెగ్మెంట్ల పరిధిలో మినహా ఉమ్మడి జిల్లాలోని మిగిలిన 12 సెగ్మెంట్లలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నట్లు తేలింది.

ప్రధాన పార్టీ అభ్యర్థుల ప్రత్యేక దృష్టి

ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లోనూ గత శాసనసభ ఎన్నికల మాదిరిగానే ఓటింగ్‌లో మహిళలు అధికంగా పాల్గొంటే పోలింగ్ శాతం భారీగా పెరుగుతుంది. దీంతో అభ్యర్థుల గెలుపోటమును వీరే ప్రభావితం చేయనున్నారు. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంపై దృష్టి సారించారు. ఇందుకోసం ఆయా పార్టీల నేతలను ప్రత్యేక ప్రణాళికతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించింది. దీనితో పాటు మహాలక్ష్మి పథకంలో భాగంగా రాబోయే రోజుల్లో ప్రతి నెల రూ.2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్.. తదితర వాటిని కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇక బీజేపీ ఆత్మ నిర్భర్‌నారీ శక్తిపై ప్రత్యేక దృష్టి సారించింది. సుకన్య సమృద్ధి యోజన, ముద్ర యోజన, లఖ్‌పతి దీదీ, స్టాండ్ ఆఫ్ ఇండియా, మిషన్ శక్తి యోజన.. తదితర కార్యక్రమాలను మహిళలకు వివరిస్తున్నారు. ఇంటింటికి తిరిగి మహిళా మోర్చా కార్యకర్తలు వీటిపై ప్రచారం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ సైతం... పదేళ్లలో మహిళల కోసం ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తున్నారు. ముఖ్యంగా ఇందులో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, పింఛన్లు, కేసీఆర్ కిట్లు అందించిన విషయాన్ని గడపగడపకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు.

మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం....				నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం..			
నియోజకవర్గం	మహిళలు	మొత్తం ఓటర్లు	శాతం	నియోజకవర్గం	మహిళలు	మొత్తం ఓటర్లు	శాతం
మహబూబ్‌నగర్	1,30,863	2,59,260	50.47	నాగర్‌కర్నూల్	1,18,603	2,36,094	50.23
జడ్చర్ల	1,11,779	2,22,838	50.16	అచ్చంపేట (ఎస్సీ)	1,24,598	2,47,729	50.29
దేవరకద్ర	1,21,130	2,39,745	50.52	కొల్లాపూర్	1,18,541	2,39,463	49.50
నారాయణపేట	1,19,682	2,36,182	50.67	వనపర్తి	1,37,984	2,73,863	50.38
మక్తల్	1,24,363	2,44,173	50.93	గద్వాల	1,30,982	2,56,637	51.03
కొడంగల్	1,22,933	2,41,794	50.84	అలంపూర్ (ఎస్సీ)	1,21,662	2,40,063	50.67
షాద్‌నగర్	1,19,422	2,38,478	50.07	కల్వకుర్తి	1,20,970	2,44,405	49.49

క్లుప్తంగా

ప్రాణం తీసిన మామిడి కాయల గొడవ

- లింగాల మండలం చెన్నంపల్లి సమీపంలో వ్యక్తి దారుణహత్య


మల్లాజీ (ఫైల్)

లింగాల: మామిడికాయల గొడవ ఓ వ్యక్తి ప్రాణం తీసిన ఘటన లింగాల మండలంలోని చెన్నంపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల మేరకు.. చెన్నంపల్లికి చెందిన అతికారి మల్లాజీ (40) సోదరుడు శ్రీనివాసులుకు గ్రామ సమీపంలో మామిడితోట ఉండగా.. కొద్ది దూరంలో అదే గ్రామానికి చెందిన లక్ష్మీ శంకర్ అనే వ్యక్తి చిన్న పాటి గుడారం వేసుకొని మేకల మంద ఉంచుకుంటున్నాడు. అతడు తరచుగా తోటలోకి వెళ్లి మామిడి కాయలను తెంపడాన్ని గమనించిన మల్లాజీ.. ఇటీవల మందలించాడు. ఈక్రమంలో మామిడి తోటను లీజుకు తీసుకున్న వ్యక్తిని పొలం వద్ద వదలడానికి బైక్‌పై వెళ్లి వస్తుండగా.. మరోసారి మల్లాజీ, లక్ష్మీ శంకర్ మధ్య గొడవ చోటుచేసుకుంది. దీంతో ఆవేశానికి గురైన లక్ష్మీ శంకర్.. తన చేతిలో ఉన్న గొడ్డలితో మల్లాజీ తలపై నరకడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇదిలా ఉండగా, మృతుడి భార్య మమత కొన్ని నెలలుగా తల్లిగారి గ్రామమైన తెల్కపల్లి మండలం రాయపాకులలో ఉంటుంది. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న అచ్చంపేట సీఐ రవీందర్, ఎస్ఐ జగన్మోహన్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట మార్చురీకి తరలించారు.

అదుపుతప్పి కారు బోల్తా

- ఒకరు మృతి.. నలుగురికి తీవ్రగాయాలు

దేవరకద్ర రూరల్: అదుపుతప్పి కారు బోల్తాపడిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా.. మరో నలుగురికి తీవ్రగాయాలైన ఘటన దేవరకద్ర మండలం డోకూర్ స్టేజీ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పుట్టపల్లికి చెందిన స్వరూపరాణి (58) కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరిలో నివాసం ఉంటున్నారు. స్వగ్రామంలో దేవుడి పూజ నిమిత్తం కుటుంబ సభ్యులు అన్విక, అవినాష్, ప్రియాంక, సాయినాథ్‌లతో కలిసి హైదరాబాద్ నుంచి కారులో బయలుదేరగా.. డోకూర్ స్టేజీ సమీపంలో కారు అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో వారందరికీ తీవ్రగాయాలు కావడంతో స్థానికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో స్వరూపరాణి మృతిచెందింది. మిగిలిన క్షతగ్రాతులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈవిషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నాగన్న తెలిపారు.

డీసీఎంను ఢీకొని మరొకరు..

మద్దూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మద్దూరు మండలం దోరేపల్లి గ్రామశివారులో శుక్రవారం చోటుచేసుకంది. ఎస్ఐ రాంలాల్ వివరాల మేరకు.. కోస్గికి చెందిన తునికి చిన్న వెంకట్రాములు (58) తన కారులో డ్రైవర్ రాములుతో కలిసి నారాయణపేటకు వెళ్లి వస్తుండగా.. దోరేపల్లి శివారులో అటుగా వస్తున్న డీసీఎంను అతివేగంగా కారు ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకట్రాములుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్‌ఎస్పీ ఎన్నికల ప్రచారంలో ఉద్రిక్తత

- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు వ్యతిరేకంగా నినాదాలు
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట


తోపులాడుకుంటున్న కాంగ్రెస్–బీఆర్‌ఎస్ కార్యకర్తలను చెదర గొడుతున్న పోలీసులు

బల్మూర్: నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్‌లో శుక్రవారం రాత్రి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నిర్వహించిన రోడ్‌షోలో ఉద్రిక్తత ఏర్పడింది. బల్మూర్ సమీపంలో నిర్మించే రిజర్వాయర్‌కు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అనుమతలిచ్చి.. రైతుల భూములు కోల్పోవడానికి కారణమయ్యావని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రసంగాన్ని అడ్డుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు రైతులతో కలిసి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగి.. ఒకరిపై ఒకరు దాడులు దిగేందుకు సిద్ధం అవ్వగా.. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఎలాంటి గొడవలు జరగకుండా సీఐ రవీందర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూడలేక స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ కాంగ్రెస్ గుండాలతో తమ ప్రచారాన్ని అడ్డుకొని.. అల్లర్లు చేయడం సరి కాదని ఆర్‌ఎస్పీ, గువ్వల విమర్శించారు. పోలీసులు వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రచారం.. చప్పగా..!

- మైకులు లేవు.. సమావేశాల ఊసే లేదు
- గ్రామాల్లోకి అడపదడపా వస్తున్న అభ్యర్థులు
- ప్రచారానికి కదలని మండల నాయకులు
- గ్రామాల్లో కనిపించని ఎన్నికల సందడి



సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

అచ్చంపేట: ఎన్నికలంటేనే ఓ పండుగ లెక్క. నెల రోజుల పాటు నిత్యం నాయకుల మాటల పోరు, ర్యాలీలూ సమావేశాల హోరు సాగుతుంది. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో ఇదే ధూంధాం కనిపించింది. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ఆ వాతావరణం ఎక్కడ కనిపించడం లేదు. ప్రచార హోరు కనిపించకపోగా, మైకులు కూడా అక్కడక్కడే మోగుతున్నాయి. ఇక ర్యాలీల జాడే లేదు. పట్టణాల్లో అంతో ఇంతో ఈ హుషారు కనిపిస్తున్నా.. ఊర్లో మాత్రం పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చప్పుడే లేకుండా పోయింది. కొన్ని చోట్ల మాత్రం అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు ప్రధాన అనుచరులు మరీ రాలేదనకుండా గ్రామాల్లో ప్రచారం చేసి వస్తున్నారు.

అప్పుడే మస్తుగుండే..

'ఎంపీ ఎన్నికలంటున్నరు.. మరీ మందూ విందు లేదా..' అని చాలా మంది నాయకులకు మందుబాబుల నుంచి ప్రశ్నలు ఎదురవుతున్నాయి. పల్లెల్లో నాయకులు ప్రచారం చేసేందుకు ముందుకు రాకపోవడంతో ఇది కూడా కారణంగా మారుతోంది. శాసనసభ ఎన్నికల్లో మద్యం జోరుగా సరఫరా కావడంతో.. మందుబాబులందరికీ ప్రచారం జరిగినన్నీ రోజుల పండుగలా సాగింది. స్థానికంగా బాధ్యతలు తీసుకున్న నాయకులు ఇంటికొచ్చి మరీ మద్యం సీసాలను అప్పగించి వెళ్లారు. ఇప్పుడేమో అంతా స్తబ్దుగా ఉంది.

కనిపించని ఉత్సాహం

గ్రామాల్లోనే కాదు.. స్థానిక నేతల్లో కూడా పెద్దగా ఎన్నికల ఉత్సాహం కనిపించడం లేదు. ప్రధానంగా పోటీ పడుతున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకుల్లోనూ ఇదే స్తబ్దత నెలకొంది. ఏ ఎన్నికలు వచ్చినా.. అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు మండలాలు, గ్రామాల వారీగా తమ నాయకులకు బాధ్యతలు అప్పగిస్తుంటారు. వారిపై మరికొందరు కో–ఆర్డినేట్ చేస్తుంటారు. కానీ ఎంపీ ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లో ప్రచార బాధ్యతలను ఇప్పటికీ నాయకులకు అప్పగించలేదు. అభ్యర్థులకు వెన్నుదన్నుగా ఉండే అనుచరులతో పాటు ఆ యా పార్టీల ప్రజాప్రతినిధులు కూడా గ్రామాల్లో సందడి చేయడం లేదు. బయటకు వెళితే ఎక్కడ ఖర్చుల భారం మీద పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఒక వేళ వెళ్లినా మైకుల హోరు.. ర్యాలీలు నిర్వహించడం లేదు. సాదాసీదాగా వెళ్లి గ్రామస్తులతో సమావేశం మాత్రమే అవుతున్నారు. మొత్తం మీద ప్రచారం 'మమ' అనేలా సాగుతుంది.

సంఘాల వారీగా..

అభ్యర్థులు శాసనసభ ఎన్నికల్లో అనుసరించిన వ్యూహాలనే లోక్‌సభ ఎన్నికల్లో అమలు చేస్తున్నారు. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రధాన పార్టీల నాయకులు గ్రామాల్లో కుల సంఘాల వారీగా కలుస్తున్నారు. కులం ఓట్లు గంపగుత్తగా తమకే వేసేలా వారిని ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కుల సంఘాల నాయకులకు వారు కోరిన కోర్కెలకు హామీలు ఇస్తున్నారు. తాము గెలవగానే మీ హామీలను పూర్తి చేస్తామని ఒప్పందాలు చేసుకుంటున్నారు. పార్లమెంట్ స్థానం పరిధి పెద్దగా ఉండటంతో అభ్యర్థులు సైతం ఎమ్మెల్యేలు, మంత్రులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులపైనే పూర్తిగా ఆధారపడుతున్నారు. ఇక అభ్యర్థులు, పార్టీలు ఆర్థికంగా తోడ్పాటునందిస్తేనే స్థానిక నాయకులు ప్రచారానికి ముందడుగు వేసే పరిస్థితి ఉంది.

అభ్యర్థులే రాలేదు..

పోలింగ్‌కు ఇంకా కొద్ది రోజులే మిగిలింది. మే 13న జరగనున్న ఎన్నికలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ప్రచారాన్ని ఈనెల 11 వరకు మాత్రమే చేయాల్సి ఉంది. ఇప్పటిదాకా పల్లెల్లోకి అభ్యర్థులే రాలేదు. ఆయా పార్టీల అగ్రనేతలు జిల్లా కేంద్రాలతో పాటు పట్టణాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలతో పాటు పెద్ద గ్రామాలకే తమ ప్రచారాన్ని పరిమితం చేస్తున్నారు. కొంతమంది ప్రజాప్రతినిధులు మాత్రమే మేజర్ ఓట్లు ఉన్న గ్రామాల్లో కార్యకర్తలు, గ్రామస్తులు నాయకుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నా.. అందాల్సినవి అందకపోవడం వల్లే ప్రచారం మాగబోయిందనే చర్చ గ్రామాల్లో హోరెత్తుతోంది.

బీజేపీ అనుకూల పార్టీలను ఓడించాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ


మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

నాగర్‌కర్నూల్ రూరల్: దేశంలో బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న రాజకీయ పార్టీలను పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్‌లో పార్లమెంట్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ దూకుడుకు కళ్లెం వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో బీజేపీకి బదులు ప్రత్యామ్నాయం అవసరమని పేర్కొన్నారు. మోదీ మళ్లీ గెలిస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా బీజేపీకి ఎదురుగాలి వీస్తుందనే విషయాన్ని దృష్టిలో ఉంచుకొనే.. మత విద్వేషాలను ప్రధాని రెచ్చగొడుతున్నారని దుయ్యబట్టారు. 29 మంది దేశ సంపదను బ్యాంకుల ద్వారా తీసుకొని ఎగ్గొట్టారని, అందులో ముస్లింలు ఎవరూ లేరని చెప్పారు. కమిషన్ ద్వారా ఇచ్చిన రిజర్వేషన్‌లను తీసివేస్తామంటే ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. దేశంలో బీజేపీకి అనుకూలంగా లేని సీఎంలను అరెస్ట్ చేయిస్తున్నారని అందులో భాగంగానే కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌లను ఇప్పటి వరకు అరెస్టు చేశారని, తెలంగాణలోనూ రేవంత్‌రెడ్డిని జైల్లో పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. లాక్‌డౌన్ ప్రకటించి కోట్లాది మంది పేదలు ఉన్న మన దేశంలో వారి ఆకలి చావులకు.. గమ్యస్థానాలకు చేరుకోవడానికి నడుచుకుంటూ వచ్చి మృత్యువాతకు కారణమయ్యారన్నారు. నియంతృత్వ రైతు చట్టాలను తీసుకువచ్చి ఏడాదిపాటు రైతులు పోరాటాలు చేస్తే ఆ పోరాటంలో 400 మంది రైతులు మృతిచెందారన్నారు. దేశ ప్రజలందరూ ఏకమై నరేంద్రమోదీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బాల్‌నర్సింహ, ఆనంద్‌జీ, కేశవులుగౌడ్, వార్ల వెంకటయ్య, జంగయ్య, రవీంద్రచారి, ఎస్‌ఎండీ ఫయాజ్, ఆంజనేయులు, పర్వతాలు, బండి లక్ష్మీపతి, శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, శివశంకర్, శంకర్‌గౌడ్, మర్యాద వెంకటయ్య, వెంకటమ్మ పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి..

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్


లింగాలలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ప్రవీణ్ కుమార్

నాగర్‌కర్నూల్ క్రైం/అమ్రాబాద్/లింగాల: గౌరవ ప్రదమైన ఉద్యోగాన్ని వదిలి ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం అమ్రాబాద్‌లో బీఆర్‌ఎస్ మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా.. లింగాలలో రోడ్‌షో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థకంగా ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని అన్నారు. ఈప్రాంత సమస్యలపై పార్లమెంట్‌లో చర్చించి, పరిష్కరించేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, అచ్చంపేట ఎన్నికల ఇన్‌చార్జి నవీన్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ రాంబాబునాయక్, జగపతిరావు, హన్మంత్‌రెడ్డి, కేటీ తిరుపతయ్య, నాగేష్, రవీందర్‌రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

➡ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 33 జిల్లాలను కుదించి, 15 జిల్లాలుగా పునర్విభజన చేస్తే రాష్ట్రం అగ్నిగుండం అవుతుందని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిపాలనా సౌలభ్యం కోసం కేసీఆర్ పాలనలో 10 జిల్లాలుగా ఉన్న రాష్ట్రాన్ని 33 జిల్లాలుగా విభజిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని 15 జిల్లాలకు కుదించేందుకు యత్నిస్తుందని ఆరోపించారు. జిల్లాల మార్పునకు వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటం నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి రెండుసార్లు ఎంపీగా గెలిచినా ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. మల్లు రవిని ఎంపీగా గెలిపిస్తే, ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు నోట్ల కట్టలు తీసుకుపోయే వ్యక్తిగా మిగులుతాడే తప్ప.. ఈప్రాంతాన్ని అభివృద్ధి చేయడని ఆరోపించారు. బీజేపీ మతాల మధ్య విద్వేషాలు రగిలిస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే, రాజ్యాంగాన్ని రద్దు చేసి, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్లు తొలగిస్తుందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పోలీస్ రిక్రూట్‌మెంట్ స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి జీఓ 46ను సవరించడంతో పాటు అన్ని శాఖల్లో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రంగినేని అభిలాష్‌రావు ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్

నాగర్‌కర్నూల్ క్రైం/బిజినేపల్లి: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది కృషిచేయాలని రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్‌తో కలిసి పెద్దముద్దునూరు, బిజినేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా పీహెచ్‌సీల్లో రోగులు, గర్భిణులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. గర్భిణుల వివరాలను తెలుసుకోవడంతో పాటు పలు రికార్డులు, ఫార్మసీ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ నిర్వహణను పరిశీలించారు. పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు అయ్యేలా చూడాలని వైద్యులకు సూచించారు. అనంతరం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో జాతీయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందుతున్నాయని తెలిపారు. జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పక్కాగా నిర్వహించడంతో పాటు అసంక్రమిత వ్యాధులు, కుష్టు, క్షయ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచాలని, హీట్ వేవ్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలలో సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయని.. మరింత బాధ్యతతో పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.వెంకటదాస్, డా.బీమానాయక్, డా.తారాసింగ్, ప్రోగ్రాం అధికారులు డా.రవినాయక్, డా.కృష్ణమోహన్, సాయినాథ్‌రెడ్డి, డా.ప్రదీప్, శివకుమార్, రాజశేఖర్ ఉన్నారు.

మహిళపై అత్యాచారం: కేసు నమోదు

జడ్చర్ల: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వివాహిత(50)పై వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన ఘటన కావేరమ్మపేటలో చోటుచేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని చిన్న యాసిపల్లితండాకు చెందిన ఓ మహిళ కావేరమ్మపేటలో అద్దెకు ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో గురువారం రాత్రి హౌసింగ్‌బోర్డు కాలనీలో కూలీ డబ్బులు తీసుకుని కావేరమ్మపేటలోని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా వెనక నుంచి వచ్చిన ఓ వ్యక్తి నోటిని మూసి పక్కనే ఉన్న పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేసి దాడి చేసి గాయపరిచాడు. తనపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తి ఆచూకీ విచారించగా, శంకరాయపల్లితండాకు చెందిన ఆంగోతు హన్మంతుగా తెలిసిందని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భారీగా పట్టుబడిన నగదు

- గ్రీవెన్స్ కమిటీకి అప్పగించిన పోలీసులు


జలాల్‌పూర్ చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీలో పట్టుబడిన నగదు

మహబూబ్‌నగర్ క్రైం/నారాయణపేట/రాజాపూర్/గట్టు: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పోలీసులు వాహన తనిఖీలను విస్తృతం చేశారు. శుక్రవారం మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్ చౌరస్తాలో టూటౌన్ సీఐ డి.స్వామిగౌడ్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టగా ఎన్.ప్రదీప్ వద్ద రూ.6,65,885 పట్టుబడగా సదరు నగదును ఎన్నికల అధికారులకు అప్పగించారు.

❒ మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌లోని రంగారెడ్డిగూడ జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేస్తుండగా హైదరాబాద్ నుంచి ఆత్మకూర్ వెళ్తున్న బొలెరో వాహనంలో హరికుమార్, తిరుపతయ్య వద్ద రూ.1.27 లక్షలు పట్టుబడగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును గ్రీవెన్స్ కమిటీ మహబూబ్‌నగర్‌కు పంపించినట్లు వివరించారు.

❒ నారాయణపేటలోని అంబేడ్కర్ చౌరస్తాలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా ఉట్కూరుకు వెళ్తున్న రమేష్ వద్ద రూ. 4.22 లక్షలు పట్టుబడ్డాయి. నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు లేనందున గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా జలాల్‌పూర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో కర్ణాటకలోని యాద్గిర్ జిల్లా నుంచి వస్తున్న వసీం అక్రమ్ వద్ద రూ.లక్ష నగదు, గుర్మిట్కల్ నుంచి వస్తున్న భీంష్ప వద్ద రూ.93,850 నగదు పట్టుబడినట్లు ఎస్ఐ వివరించారు.

❒ జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు బల్గెరలో శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.3.41 లక్షలు పట్టుబడ్డాయి. గట్టులో రూ.2.49 లక్షలు, కర్ణాటక సరిహద్దులోని బల్గెర చెక్‌పోస్టు వద్ద రూ.92 వేలు పట్టుబడగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. పట్టుబడిన మొత్తాన్ని జిల్లా గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించినట్లు వివరించారు.

ఉరేసుకొని వ్యక్తి మృతి

పెబ్బేరు రూరల్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. గోపాల్‌పేట మండలం ఏదుట్లకు చెందిన గుణగంటి తిరుమలేష్(42) మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య అతనిని వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో తిరుమలేష్ అత్త గారి ఊరి సమీపంలోని కంభాళాపురం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. ఈ ఘటనపై తిరుమలేష్ తండ్రి చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల/ బాలానగర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైతే నమ్మకంతో కాంగ్రెస్ పార్టీని ఆదరించి అధికారంలోకి తీసుకొచ్చారో, ఆదే నమ్మకంతో మరోసారి తనను ఆదరించి పార్లమెంట్‌కు పంపితే జడ్చర్ల నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వాన సభ్యులు, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి తెలియజేశారు. శుక్రవారం జడ్చర్ల నేతాజీ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో సీపీఐ జాతీయ నాయకులు నారాయణ, స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి ప్రసంగించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజలను నట్టేట ముంచాయని విమర్శించారు. నిరుద్యోగులకు ఎక్కడా ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను తూచ తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఆరు గ్యారంటీల హామీలు కార్యరూపం దాలుస్తాయన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కేంద్రం నుంచి అత్యధిక నిధులను తీసుకొచ్చి అభివృద్ధికి పాటుపడుతామన్నారు. 13న జరిగే పోలింగ్‌లో తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కేంద్రంలో కాంగ్రెస్ వస్తేనే ధరలు తగ్గుముఖం

కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఆకాశాన్ని అంటుతున్న బంగారం ధరను తగ్గిస్తామని, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని వంశీచందర్‌రెడ్డి అన్నారు. బాలానగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీని గెలిపిస్తే రూ.1,100 ఉన్న సిలిండర్‌ను రూ.2,500కు పెంచుతారన్నారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.500 ఇస్తుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో శివసేనా రెడ్డి, మిథున్ రెడ్డి, బాద్మి శివకుమార్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మీ ఇంటి ఆడబిడ్డను ఆశీర్వదించండి


ధన్వాడ మండలం కొండాపూర్‌లో మాట్లాడుతున్న డీకే అరుణ

మరికల్/ ధన్వాడ: పాలమూరు కీర్తిని ఢిల్లీ వరకు తీసుకెళ్లాలంటే మీ ఇంటి ఆడబిడ్డను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. మరికల్, పెద్దచింతకుంట, ధన్వాడ మండలంలోని కొండాపూర్, కంసాన్‌పల్లి, దామరగిద్దలో శుక్రవారం నిర్వహించిన రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం పాదయాత్ర చేశానన్నారు. ఈ ప్రాంత ప్రజల కష్ట, సుఖాలు తనకు తెలుసని, కాంగ్రెస్ వాళ్ల మాటలు నమ్మితే మరో ఐదేళ్లు వెనక్కి వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ప్రజల నుంచి తనకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే సీఎం రేవంత్‌రెడ్డి అక్కసుతో తనను అడ్డమైన మాటలు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడికెళ్లినా మోదీ ప్రభంజనమే కనిపిస్తుందని, మూడోసారి ఆయన ప్రధాని కావాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమ కోసం ఎన్నో పథకాలను అమలు చేసిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తాను గెలిచిన కొడంగల్‌తో కలిసి ఉన్న పాలమూరు ఎంపీ నియోజకవర్గంలో బీజేపీ ఎంపీ గెలిస్తే తన పదవికి గౌరవం తగ్గుతుందనే అహంతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ ఎంపీని గెలిపించేందుకు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓటేస్తే మీ ఓటు బురదలో వేసినట్టేనని, కమలం పువ్వు గుర్తుకు ఓటేస్తే దేశాన్ని అభివృద్ధి చేయడంలో మీ వంతు పాత్ర పోషించిన వాళ్లవుతారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు రతంగపాండురెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు మల్లయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు విమల, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, బీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సత్యయాదవ్, లక్ష్మి, శ్యాంసుందర్, గోపాల్‌రావు, సత్యనారాయణ, నర్సన్‌గౌడ్, తిరుపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సురేందర్, ఉమేష్, ఉదయభాను, రామచంద్రయ్య, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాయమాటలకు మోసపోవద్దు

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పి.భరత్‌ప్రసాద్


మల్దకల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న భరత్‌ప్రసాద్

మల్దకల్/ధరూర్/కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌పార్టీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం మల్దకల్ మండలం అమరవాయి, మల్దకల్, మద్దెలబండ, కేటీదొడ్డి మండలంలోని పాగుంట, ఇర్కిచేడు, నందిన్నె ధరూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలను అభివృద్ధి చేసి చూపుతానని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టు నిర్మాణం పేరుతో రూ.కోట్లు దండుకున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మల్దకల్ ఆదిశిలా క్షేత్రానికి రాగా ఆలయ నిర్వాహకుడు అరవిందరావు, అర్చకులు రవిచారి, నాగరాజుశర్మ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ విశిష్టతను వివరించి తీర్థ ప్రసాదాలు అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామాంజనేయులు, శివారెడ్డి, విజయలక్ష్మి, రాములు, మురళీధర్‌రెడ్డి, దామ నాగరాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్దబావి తిమ్మన్న, జనార్దన్‌రెడ్డి, నర్సింహులు, అశోక్, లాజర్, ధరూర్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి శివారెడ్డి, రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, మండల అధ్యక్షుడు ఉప్పేరు శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు అఫ్సర్‌పాషా, నాయకులు కిష్టన్న, జగదీశ్వర్‌రెడ్డి, లక్ష్మన్న, చింతరేవుల ఆంజనేయులు, గోవర్ధన్‌రెడ్డి, సూర్యకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎండలోనుంచి వచ్చిన వెంటనే
చల్లటి నీళ్లు తాగుతున్నారా?

ఎండలో తిరిగి ఇంటికి వచ్చిన వెంటనే ఫ్రిడ్జ్ లోనుంచి బాటిల్ తీసుకుని చల్లని నీళ్లు గటగటా తాగడం చాలా మందికి అలవాటే. విపరీతమైన వేడిలో మన శరీరానికి రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీరు కొంత ఉపశమనం కలిగించేమాట నిజమే అయినా ఇలా చేయడం మంచిది కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు.

ఎండలోనుంచి వచ్చిన వెంటనే చల్లటి నీళ్లు తాగడం వల్ల గొంతు నొప్పి, టాన్సిలైటిస్ సమస్య మాత్రమే కాదు.. జీర్ణక్రియ నుంచి రోగనిరోధక వ్యవస్థ వరకు... చివరకు గుండెపై కూడా తీవ్ర ప్రభావం పడుతుంది.

ఎందుకంటే రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీటిని తాగడం వల్ల రక్తనాళాలు కుచించుకుపోతాయి. అదేవిధంగా ఆహారం తిన్న తర్వాత చల్లటి నీరు తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గిపోయి జీర్ణక్రియలో సమస్యలు తలెత్తుతాయి. దీంతో ఘన ఆహారం సరిగా జీర్ణం కాదు. ఫలితంగా మలబద్ధకం వస్తుంది.

అంతేకాదు, చల్లటి నీటిని తాగడం వల్ల ఈ నాడి చల్లబడుతుంది. ఇది హృదయ స్పందన రేటును తగ్గిస్తుంది. గుండె కొట్టుకునే వేగం ఒక్కసారిగా తగ్గితే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది.

రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీటిని ఎక్కువగా తాగడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఫలితంగా శరీరంలో వివిధ రకాల సమస్యలు సంభవిస్తాయి. చల్లటి నీటిని తాగడం వల్ల శరీరంలో పేరుకుపోయిన కొవ్వు గట్టిపడుతుంది. ఇది బరువు పెరిగేందుకు దారితీస్తుంది.

అందువల్ల వీలయినంత వరకు ఎండలో నుంచి రాగానే చల్లటి నీళ్లు తాగకూడదు. అందులోనూ ఫ్రిజ్‌లోని నీళ్లు తాగడం అసలు మంచిది కాదు. కొంచెంసేపు ఆగిన తర్వాత కుండలోని నీళ్లు లేదా నార్మల్ వాటర్ ముందు తాగి, ఆ తర్వాత చల్లటి నీళ్లు తాగినా ఫరవాలేదు.

మీకు తెలుసా?

మెదడుకు పదును..!

బజారులో నడిచి వెళ్తున్నప్పుడు తెలిసిన వ్యక్తి ఎదురు పడితే వెంటనే పేరు గుర్తురాదు. పలకరింపుగా నవ్వి ఏదో ఒక రకంగా మేనేజ్ చేయాల్సి వస్తుంది. ఇలా తరచూ జరుగుతుంటే మెదడు బద్ధకంగా ఉంటోందని, మతిమరుపు పెరుగుతోందని జాగ్రత్త పడాల్సిందే. వార్ధక్య లక్షణాలను దూరంగా ఉంచడానికి దేహానికి వ్యాయామం చేసినట్లే మెదడు చురుగ్గా ఉండడానికి తగినంత వ్యాయామం కావాలి. రోజూ కనీసం ఒక్క పజిల్‌నైనా పరిష్కరించడం జ్ఞాపకశక్తిని మెరుగుపరచుకోవడానికి మంచి మార్గం. అలా మెదడును కూడా చురుగ్గా ఉంచినప్పుడే మతిమరుపు అనే వార్ధక్య లక్షణం దూరమవుతుంది. రోజూ ఈ ప్రాక్టీస్ ఉంటే డెబ్బై ఏళ్లు నిండినా సరే జ్ఞాపకశక్తి తగ్గదు. మతిమరుపు దరిచేరదు. దరిచేర్చుకోకూడని మిత్రుడు మతిమరుపు, మెదడు వాడదాం... మెదడును 'వాడి'గా ఉంచుకుందాం.



చక్కెర తగ్గిస్తే కలిగే ప్రయోజనాలివి



చక్కెర ఉన్న పానీయాలు, స్వీట్లు, ఇతర పదార్థాలను తినడం మానేస్తే శరీరంలోకి అధికంగా చేరే కేలరీల పరిమాణం తగ్గుతుంది. దీని వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. ● చక్కెరను దూరం పెట్టడం వల్ల హైబీపీ, గుండె జబ్బులు సహా ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే ముప్పు తగ్గుతుంది ● నోటి ఆరోగ్యం, దంత సంరక్షణ కోసం చక్కెరను దూరం పెట్టడం చాలా మంచిది. చక్కెరతో కూడిన ఆహార పదార్థాలను దూరం పెడితే నోటి సమస్యలు వచ్చే అవకాశం కూడా తగ్గుతుంది ● చక్కెర తినడం మానేయడం వల్ల టైప్-2 డయాబెటిస్ వచ్చే అవకాశం కూడా చాలా తగ్గుతుంది. మూడ్ స్వింగ్స్, చిరాకు, కోపం తగ్గుతుంది. చర్మం త్వరగా ముడతలు పడటం తగ్గి కాంతిమంతంగా మారుతుంది ● జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కడుపుబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి.

పిల్లల్లో... వ్యాధి నిరోధకత పెంచండిలా!



వేసవి సెలవలు ఇచ్చేశారు. పిల్లలందరూ ఇంటి దగ్గరే ఉంటారు. ఈ సమయంలోనే వారికి వ్యాధినిరోధక శక్తి అంటే ఇమ్యూనిటీ పెరిగే ఆహారాన్ని అందించడం వల్ల స్కూళ్లు తిరిగి తెరిచి, వర్షాలు పడినా కూడా చిన్నా చితకా వ్యాధులు రాకుండా ఉంటాయి. పిల్లలకు ఎలాంటి ఆహారం అందించాలో తెలుసుకుందాం...

సాధారణంగా పోషకాలన్నీ ఉన్న సమీకృత ఆహారం అందించడం వల్ల వ్యాధినిరోధకత పెరుగుతుంది. అందుకు ఏం చేయాలో చూద్దాం...



గుడ్డు: కోడిగుడ్డులో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. పిల్లలకు రోజూ ఒక ఉడికించిన గుడ్డు తినిపించాలి. కండరాలు, చర్మం, గుండె ఆరోగ్యానికి గుడ్డు మంచిది. పిల్లల ఎదుగుదలకు అవసరమైన విటమిన్ ఎ, బి2 (రైబోఫ్లేవిన్) కోడిగుడ్డులో లభిస్తాయి.



ఆకుకూరలు: ఆకుపచ్చటి ఆకుకూరలు, కొత్తిమీర, పాలకూర, ఈ సీజన్‌లో సమృద్ధిగా లభించే మునగకాడలు వంటివి తప్పనిసరిగా పెట్టాలి. వీటిలో ఫైబర్‌తోపాటు ఐరన్, జింక్, మినరల్స్ లభిస్తాయి.



పెరుగు, మజ్జిగ: పెరుగులో ప్రోబయోటిక్స్, విటమిన్ బి12 లభిస్తాయి. ఇది పొట్టలో చెడు బ్యాక్టీరియా వృద్ధి చెందకుండా కాపాడుతుంది. ఇమ్యూనిటీని పెంచుతుంది. కాబట్టి పిల్లలు ఇష్టంగా తినేలా ఫ్రూట్ యోగర్ట్, వెజిటబుల్స్ రైతా, బూందీ రైతా రూపంలో ఇవ్వొచ్చు.

పసుపు: పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుంటాయి. పిల్లలకు రోజూ ఇచ్చే ఆహారంలో చిటికెడు పసుపును చేర్చడం వల్ల ఆస్తమా, అలర్జీకి సంబంధించిన సమస్యలు దరిచేరకుండా ఉంటాయి. పాలల్లో పసుపు వేసి తాగించడం అలవాటు చేయవచ్చు.

బాదం, జీడిపప్పు, ఎండుద్రాక్ష, వాల్‌నట్స్, అప్రికాట్స్ వంటివి ఎక్కువగా తినిపించడం వల్ల మెదడు ఎదుగుదలకు అవసరమైన పోషకాలు లభించడంతో పాటు పిల్లల్లో ఇమ్యూనిటీ పెరుగుతుంది.

ఇంకా సీజనల్ ఫ్రూట్స్ అయిన మామిడి, జామ, తాటిముంజలు, సపోటా వంటివి ఇవ్వాలి.

పిల్లలకు స్వీట్స్, పంచదార ఎక్కువగా ఉండే ఇతర పదార్థాలైన ఫ్రూట్‌జ్యూస్‌లు, చాక్లెట్స్, ప్యాకేజ్ స్నాక్స్‌ను ఎక్కువగా తినిపించకూడదు. ఇవి ఇమ్యూనిటీని తగ్గిస్తాయి. ముఖ్యంగా పిల్లలు రోజూ తగినంత నిద్రపోయేలా చూడాలి. గంటసేపైనా బయట ఆడుకునేలా ప్రోత్సహించాలి. ఈ జాగ్రత్తలు పాటించడం మంచిది.

హెల్త్ టిప్స్



● కిస్మిస్‌లలో జింక్, కాల్షియం, విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి మనకు ఎంతగానో మేలు చేస్తాయి. రాత్రిపూట కొన్ని కిస్మిస్‌లను తిని గోరువెచ్చటి నీరు తాగితే మరుసటి రోజు ఉదయం విరేచనం సాఫీగా జరుగుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. దీంతో పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు. అలా కాకపోతే రాత్రి పూట కిస్మిస్‌లను నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం కూడా తినవచ్చు. ఎలా తిన్నా సమస్య నుంచి బయట పడతారు.

● బాదంపప్పులో ప్రోటీన్లు, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ ఇ, కాల్షియం, ఫాస్పరస్ అధికంగా ఉంటాయి. అందువల్ల బాదంపప్పును రోజూ తింటే పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు. ఇందుకు గాను బాదంపప్పును రాత్రి పూట నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయాన్నే పరగడుపునే వాటిని పొట్టు తీసి తినాలి. దీని వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు పోవడంతోపాటు మలబద్ధకం తగ్గుతుంది. పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు.

● జామపండ్లలో విటమిన్లు, మినరల్స్ అనేకం ఉంటాయి. ఇవి దంతాలు, చిగుళ్ల సమస్యలు, జీర్ణ సమస్యలను తగ్గిస్తాయి. జామ పండ్లను తినడం వల్ల తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మలబద్ధకం ఉండదు. అలాగే పైల్స్ కూడా తగ్గిపోతాయి. రోజూ రాత్రి భోజనం చేసిన తరువాత నిద్రకు ముందు ఒక జామ పండును తింటే ఈ ప్రయోజనం కలుగుతుంది. దీంతో రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

● రోజూ పరగడుపునే మూడు లేదా నాలుగు పచ్చి వెల్లుల్లి రెబ్బలను తీసుకుని పెనంపై వేసి వేయించి వాటిని అలాగే తినాలి. నేరుగా తినలేం అనుకుంటే తేనెతో కలిపి తీసుకోవచ్చు. దీని వల్ల జీర్ణ శక్తి పెరుగుతుంది. మెటబాలిజం మెరుగు పడుతుంది. గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. అజీర్ణం నుంచి బయట పడతారు. మలబద్ధకం తగ్గి పైల్స్ నుంచి విముక్తి పొందవచ్చు.

● జీర్ణ సమస్యలను తగ్గించడంలో బెల్లం అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ రాత్రి భోజనం అనంతరం చిన్న బెల్లం ముక్కను చప్పరిస్తూ తినాలి. దీంతో తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మరుసటి రోజు సుఖ విరేచనం అవుతుంది. క్రమం తప్పకుండా రోజూ రాత్రి బెల్లం తింటే పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు.

సినిమా

కన్నప్పకి బై బై



● విష్ణు మంచు, అక్షయ్ కుమార్

బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ 'కన్నప్ప'కి బై బై చెప్పారు. తన పాత్రకి సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేసిన ఆయనకి చిత్ర యూనిట్ వీడ్కోలు పలికింది. విష్ణు మంచు హీరోగా ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కన్నప్ప'. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై మంచు మోహన్‌బాబు పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైన షెడ్యూల్‌లో అక్షయ్ కుమార్ జాయిన్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా తన సీన్లకు సంబంధించిన షూట్‌ను ఆయన పూర్తి చేశారు. ''అక్షయ్ కుమార్‌గారి నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఈ ప్రయాణం ఎంతో విలువైనది'' అని సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు విష్ణు మంచు. ''ధైర్యవంతుడైన యోధుడు, శివ భక్తుడైన కన్నప్ప కథతో ఈ చిత్రం అద్భుతంగా రూపొందుతోంది. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది'' అన్నారు మేకర్స్.



● నయనతార

ముంబైలో వేట్టయాన్



● అమితాబ్ బచ్చన్ ● రజనీకాంత్

ముంబైలో అమితాబ్ బచ్చన్‌ను కలిశారు వేట్టయాన్. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వేట్టయాన్' (వేటగాడు). అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా ఇతర లీడ్ రోల్స్‌లో దుషారా విజయన్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం ఇది. తాజాగా 'వేట్టయాన్' చిత్రీకరణ ముంబైలో ప్రారంభమైంది. రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. గతంలో హైదరాబాద్‌లో జరిగిన 'వేట్టయాన్' షూటింగ్ షెడ్యూల్‌లో రజనీ, అమితాబ్ కాంబినేషన్ సీన్స్ తీశారు. ఇప్పుడు ముంబైలో వీరిద్దరి కాంబినేషన్ సీన్స్‌ను తీస్తున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని టాక్.

వినోదాల పతంగ్



● ప్రీతి పగడాల

ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'పతంగ్'. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వం వహించారు. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్‌పై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను డైరెక్టర్ బుచ్చిబాబు సానా విడుదల చేశారు. ఈ సినిమా కాంటెస్ట్ విజేతలకు సిరిసిల్ల మాజీ ఎంపీ రాజయ్య బహుమతులు అందించారు. బుచ్చిబాబు సానా మాట్లాడుతూ– ''ఈ మూవీ కంటెంట్ చూస్తుంటే 'హ్యాపీడేస్' సినిమాలా ఘన విజయం సాధిస్తుందనిపిస్తోంది'' అన్నారు. ''తొలిసారి పతంగుల పోటీతో రాబోతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్''' అన్నారు ప్రణీత్ ప్రత్తిపాటి. ''వేసవిలో మా సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది'' అన్నారు సంపత్ మక. ప్రణవ్ కౌశిక్, ప్రీతి పగడాల, వంశీ పూజిత్, క్రియేటివ్ నిర్మాత నాని బండ్రెడ్డి పాల్గొన్నారు.

టాక్సిక్‌లో..?

యశ్

'టాక్సిక్' సినిమాలో నయనతార భాగం కానున్నారా? అంటే అవుననే టాక్ కన్నడ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. యశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్'. మలయాళ నటి–దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా కియారా అద్వానీ, శ్రుతీహాసన్ వంటి స్టార్స్ పేర్లు వినిపించాయి. అలాగే యశ్‌కు సోదరి పాత్రలో కరీనా కపూర్ నటిస్తారనే ప్రచారం జరిగింది. దీనికి తోడు తాను సౌత్ సినిమా అంగీకరించినట్లు ఆ మధ్య కరీనా స్వయంగా వెల్లడించారు. అది 'టాక్సిక్' సినిమానే అనే ప్రచారం సాగింది. అయితే తాజాగా షూటింగ్ కాల్షీట్స్ సర్దుబాటు చేయలేని కారణంగా ఈ ప్రాజెక్ట్ నుంచి కరీనా కపూర్ తప్పుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ ప్లేస్‌లో నయనతారను తీసుకోవాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. 2010లో ఉపేంద్ర నటించిన 'సూపర్' కన్నడలో నయనతారకు తొలి సినిమా. వార్తల్లో ఉన్న ప్రకారం నయనతార 'టాక్సిక్' సినిమా చేస్తే.. పద్నాలుగేళ్ల తర్వాత ఆమె కన్నడ సినిమా చేసినట్లవుతుంది.

లక్ష్మీ కటాక్షం ఫిక్స్



● 'లక్ష్మీ కటాక్షం' పోస్టర్

సాయికుమార్ లీడ్ రోల్‌లో సూర్య దర్శకత్వం వహించిన చిత్రం 'లక్ష్మీ కటాక్షం: ఫర్ ఓట్'. ఆమని, వినయ్, అరుణ్, దీప్తీ వర్మ, చరిష్మా శ్రీకర్, హరి ప్రసాద్, సాయికిరణ్ ఏడిద కీలక పాత్రల్లో నటించారు. యు. శ్రీనివాసుల రెడ్డి, బి. నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కె. పురుషోత్తం రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న రిలీజ్ కానుంది. ''పొలిటికల్ సెటైరికల్ డ్రామా, కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం ఇది. ఈ చిత్రంలో ఓటర్లే వారి ఓటుకు ఒక రేటు నిర్ణయించుకుని నాయకులని ముప్పు తిప్పలు పెట్టే సీన్లు ప్రేక్షకులను నవ్విస్తాయి'' అన్నారు మేకర్స్.




● మెరిల్ స్ట్రీప్

ఈ పురస్కారం నాకో గౌరవం

హాలీవుడ్ ప్రముఖ నటి మెరిల్ స్ట్రీప్ ఆనందంలో ఉన్నారు. ఈ నెల 14 నుంచి 25 వరకు ఫ్రాన్స్‌లో 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ చలన చిత్రోత్సవాల్లో ప్రతిష్ఠాత్మకమైన పామ్ డి ఓర్ గౌరవ పురస్కారానికి మెరిల్ స్ట్రీప్‌ను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఆమె ఆనందానికి కారణం ఇదే. ఈ ఏడాది మెరిల్ స్ట్రీప్‌కు, జపాన్‌కు చెందిన యానిమేషన్ 'స్టూడియో ఘిబ్లి' నిర్వాహకులకు, హాలీవుడ్ దర్శక–నిర్మాత జార్జ్ వాల్టన్ లూకాస్ జూనియర్ (స్టార్ వార్స్, ఇండియానా జోన్స్' ఫేమ్)కు పామ్ డి ఓర్ పురస్కారాన్ని అందజేస్తారు. ఈ సందర్భంగా మెరిల్ స్ట్రీప్ మాట్లాడుతూ – ''ఈ అవార్డుకు ఎంపిక కావడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. అంతర్జాతీయ నటీనటులు, ఫిల్మ్ మేకర్స్ భాగస్వామ్యులైన కాన్స్ వేదికగా నేను ఈ అవార్డును గెలుచుకోవడం అనేది ఫిల్మ్ మేకింగ్ రంగంలో నాకు దక్కిన ఓ అద్భుత విజయంగా భావిస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు. గతంలో హాలీవుడ్ స్టార్స్ టామ్ క్రూజ్, మైఖేల్ డగ్లస్, హారిసన్ ఫోర్డ్ వంటివారికి పామ్ డీ ఓర్ అవార్డు దక్కింది.

1980లో ఏం జరిగింది?



● రాకేష్ వర్రె

'ఉయ్యాలా జంపాలా, మజ్ను' చిత్రాల ఫేమ్ విరించి వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. రాకేష్ వర్రె హీరోగా నటించారు. వైశాలీ రాజ్, రియా సుమన్, ఛత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవి ప్రకాశ్ ఇతర పాత్రల్లో నటించారు. ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా విరించి వర్మ మాట్లాడుతూ– ''1980లో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా పొలిటికల్ డ్రామాగా ఈ సినిమాను రూపొందించాం. ప్రేమకథలు దర్శకత్వం వహించిన నేను 'జితేందర్ రెడ్డి' లాంటి యాక్షన్ మూవీ చేయడంతో క్రేజ్ నెలకొంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వీఎస్ జ్ఞాన శేఖర్, సంగీతం: గోపీ సుందర్.

సూపర్ డీలక్స్...



● అషు రెడ్డి

'బిగ్ బాస్' ఫేమ్ అషు రెడ్డి, చాందినీ చౌదరి, వశిష్ఠ సింహా, జై భారత్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'యేవమ్'. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నవదీప్, పవన్ గోపరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో హారిక పాత్ర చేస్తున్న అషు రెడ్డి లుక్‌ను విడుదల చేశారు. ''మహిళా సాధికారతను చాటి చెప్పే నేపథ్యంలో 'యేవమ్' ఉంటుంది. నా బాడీ సూపర్ డీలక్స్ అని అషు రెడ్డి కిక్ ఇచ్చే పాత్రలో ఎందుకు కనిపించబోతున్నారో తెలియాలంటే 'యేవమ్' విడుదల వరకు ఆగాల్సిందే. కొత్త కథతో వైవిధ్యమైన నరేషన్‌తో ఈ సినిమా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

ఎమోషనల్ సత్య

సమాజంలో తన వల్ల తన తల్లిదండ్రులకు ఏ మాత్రం ఇబ్బంది కలగకూడదని ఆలోచించే ఓ కొడుకు కథతో రూపొందిన చిత్రం 'సత్య'. హమరేశ్, ప్రార్థనా సందీప్ జంటగా నటించిన ఈ చిత్రానికి వాలీ మోహన్‌దాస్ దర్శకుడు. శివమ్ మీడియా పతాకంపై శివ మల్లాల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా వాలి మాట్లాడుతూ– ''సత్య' సినిమా హిట్ అయి, యూనిట్‌కి మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''ఈ సినిమా సెన్సార్ పూర్తయింది. ఈ నెల 10న తెలుగు రాష్ట్రాల్లో భారీ స్థాయిలో సినిమాను విడుదల చేయనున్నాం'' అన్నారు శివ మల్లాల.



● హమరేశ్, ప్రార్థన

ఏమయ్యిందే...



● అశోక్ గల్లా, మానస

అశోక్ గల్లా, వారణాసి మానస జంటగా నటిస్తున్న చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకుడు. 'హనుమాన్' మూవీ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ కథ అందించారు. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'ఏమయ్యిందే..' అంటూ సాగే తొలి పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. సురేష్ గంగుల రాసిన ఈ పాటని ఈశ్వర్ దాతు పాడారు.